క్లుప్తంగా

తక్కళ్లపల్లి అభివృద్ధికి నిధులివ్వండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి నేతల వినతి



వినతిపత్రం అందజేస్తున్న వార్డుసభ్యులు

యాచారం: తక్కళ్లపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఆ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అక్కి వెంకటేష్ ఆధ్వర్యంలో పట్నం లక్ష్మమ్మ, భారతమ్మ, కంబాలపల్లి పుల్లమ్మ, రాఘవేందర్, తలారి సత్యనారాయణ, దశరథ తదితరులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంపత్‌కుమార్, కిషన్ ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి శివాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధిచి ఆలయ హుండీని ఆదివారం లెక్కించారు. ఆలయ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మాకం పాండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కార్యదర్శి మల్లారెడ్డి సమక్షంలో ఆలయ నిర్వాహకులు హుండీని లెక్కించారు. రూ.5,96,000 ఆదాయం వచ్చినట్లు అధ్యక్షుడు పాండయ్య చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెంటారెడ్డి, సర్పంచ్ స్వప్న, ఉపసర్పంచ్ వరలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌నాయక్, అశోక్, రాజునాయక్, మల్యానాయక్, పాండు, శ్రీనివాసురెడ్డి, విజెందర్‌రెడ్డి, రాజు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ మృతి



మాడ్గుల: మండలంలోని నాగిళ్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బండ లక్ష్మమ్మ(50) అనారోగ్యంతో ఆదివారంమృతిచెందింది. లక్ష్మమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో ఆమె మరణించారు. లక్ష్మమ్మకు భర్త నర్సింహ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగిళ్ళ ఉమ్మడి పంచాయతీకి 2001–06 సంవత్సరంలో బండ లక్ష్మమ్మ సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె మృతి పట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్‌కు చెందిన రామచంద్రయ్య, యాదమ్మ దంపతుల కుమారుడైన హరికృష్ణ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ శ్రీశైలం ఆదివారం ఆస్పత్రికి వెళ్ళి హరికృష్ణను పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. భిక్షపతి, శ్రీను, సత్తయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన నేనావత్ మహేందర్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.60 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి సర్పంచ్ హంశమోత్యానాయక్ చెక్కు అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌కు చెందిన..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన గుంటి పాండుకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.1,00,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు ఆ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, అడ్వకేట్ అంజనేయులుగౌడ్, అశన్న, మల్లేశ్, వెంకటయ్యగౌడ్, నిరంజన్, వెంకటయ్య, మహేష్ నేత, లక్ష్మయ్య, రాములు, హరీష్, శ్రీను, రవి, పరంధాములు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలానికి చెందిన..

మాడ్గుల: మండలంలోని గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన వాణికి సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.42వేల చెక్కు, అదేవిధంగా పద్మకు మంజూరైన రూ.24 వేల చెక్కు, అర్జున్‌కు మంజూరైన రూ.26 వేల చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదివారం అందజేశారు. సర్పంచ్ నర్సింహారెడ్డి, మండల రైతుసమితి మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వనస్థలిపురం: యశోద ఆస్పత్రి సోమాజిగూడ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురంలోని శ్రీ కృష్ణ ఎండో అండ్ డయాబెటిక్ సెంటర్ ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన వారికి కార్డియాలజీ, 2డి ఇకో, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. యశోద ఆస్పత్రి కార్డియాలజీ ఎండీ, డీఎం డాక్టర్ జగదీష్ మాదిరెడ్డి, శ్రీ కృష్ణా ఎండో, డయాబెటిక్ సెంటర్ ఎండీ, డీఎం డాక్టర్ జె.నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- 1నుంచి కలికిదొనగుట్ట గోపాలస్వామి ఆలయ ఉత్సవాలు
- ఏర్పాట్లను పూర్తిచేసిన నిర్వాహకులు

తలకొండపల్లి: కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా కల్కిదొనగుట్ట గోపాలస్వామి చాలా ప్రసిద్ధి. ఈ ఆలయంలో నిద్ర చేస్తే దుష్టశక్తులను పారద్రోలి మానసిక ప్రశాంతత కలుగునని భక్తుల విశ్వాసం. ఇక్కడి కోనేటిలో స్నానం చేసిన యెడల సకల పాపాలు తొలగిపోతాయని.. సంతానంలేని వారికి సంతానం కలుగునని పూర్వీకుల నమ్మకం. దీంతో రాష్ట్రం నలువైపుల నుంచి భక్తులు ఇక్కడికి తరలి వస్తుంటారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిలో ఆమనగల్లు నుంచి 8 కి.మీ దూరంలో మండల పరిధిలోని చుక్కాపూర్ శివారులో ఈ కలికిదొనగుట్ట గోపాలస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేతంగా కలికిదొన గోపాలస్వామి స్వయంభూ మర్రిచెట్టు కింద వెలిసియున్నాడు. దీంతో పూర్వీకులు ఇక్కడ ఆలయం నిర్మించారు. నాటినుంచి నేటి వరకు ఇక్కడ నిరంతరం పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గాలిగోపురం, లక్ష్మీగణపతి, నవగ్రహాలు, ఈశ్వరుడు, ఆంజనేయులు తదితర విగ్రహాలను ప్రతిష్టించారు.

బ్రహ్మోత్సవాల వివరాలు..

ఇంత చరిత్ర, మహిమగల గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వచ్చేనెల మార్చి 1వ తేదీన ప్రారంభమై 6వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ఫౌండరీ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ తెలిపారు. 1న గణపతిపూజ, కల్యాణోత్సవం, 2న గరుడ వాహనసేవ, 3న చిన్నతేరు, (పూలరథము), 4న పెద్దతేరు (రథోత్సవం), 5న రాత్రి గజవాహనము, దోపోత్సవము, 6న చక్రతీర్థం తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.





గోపాలస్వామి దేవాలయం, (ఇన్‌సెట్‌లో) రుక్మిణి, సత్యభామ సమేత గోపాలస్వామి

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలలు నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. జరిగింది. ఆలయంలో అన్ని వసతులు కల్పించి నిత్యపూజలు చేసేలా చర్యలు తీసుకోవాలి. అభివృద్ధి చేయాలి.

– శ్యాంసేట్, ఆమనగల్లు

ఏర్పాట్లు పూర్తిచేశాం



ప్రతియేటా పాల్గుణ శుద్ధ నవమి మొదలు చతుర్ధశి వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. ఈ యేడాది ఉత్సవాలకు సంబంధించి పూర్తి ఏర్పాట్లు చేశాం. వేసవి నేపథ్యంలో ఆలయ ఆవరణలో టెంట్లు, చలువ పందిర్లు వేసి నీడను కల్పిస్తున్నాం. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

– పట్టాభిరామ శర్మ, ఆలయ ఫౌండరీ ట్రస్టు చైర్మన్

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మద్దెలకుంటతండా, రావిచేడ్ గ్రామాల్లో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పర్యటించారు. మద్దెలకుంటతండాలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత డ్రైనేజీ పనులను, రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఉపసర్పంచ్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీకన్ననాయక్, నాయకులు మల్లేశ్, సర్యానాయక్, లింగంయాదవ్, భిక్షపతి, రమేశ్, యాదగిరి, ధర్మ, భాస్కర్, శ్రీను, వాచ్య ఉన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు



బహిరంగ సభలో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్

మంచాల: క్షేత్ర స్థాయిలో బీజేపీ బలమైన శక్తిగా ఎదగాలంటే ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి ఆరుట్ల గ్రామంలో బీజేపీ శక్తి కేంద్రాల కార్నర్ బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో బీజేపీ ఎదుగుదలకు కష్టపడి పని చేయడమే కాకుండా కార్యకర్తలను సమన్వయ పర్చాలని అన్నారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలువాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచిరెడ్డి, రాష్ట్ర నాయకుడు వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ భాషయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఆరుట్ల ఉపసర్పంచ్ జంగయ్యగౌడ్, మంచాల మండల బీజేపీ అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, సింగల్ విండో డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి, వార్డుసభ్యులు మోహన్‌రెడ్డి, రమేష్, నాయకులు వెంకట్‌రెడ్డి, జంగయ్య, నర్సింహారెడ్డి, మల్లయ్య, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహచారి, నరేందర్ పాల్గొన్నారు.

సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: లంబాడాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 284వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో మహాభోగ్ బండారో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సంత్ సేవాలాల్ జాతికి చేసిన సేవలను కొనియాడారు. సేవాలాల్ విగ్రహప్రతిష్ఠాపనకు తగిన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, నాయకులు కృష్ణాగౌడ్, లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు స్వాతి అమరేందర్‌రెడ్డి, సంగీతా మోహన్‌గుప్త, కల్యాణ్ నాయక్ పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం..

తుర్కయంజాల్: సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాంజారాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ట్రైకార్ చైర్మన్ రాంచదర్ నాయక్, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, మాజీ జెడ్పీటీసీ నోముల కృష్ణాగౌడ్, నాయకులురమేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకుంటున్నారు

- ప్రతిపక్ష పార్టీలపై బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఫైర్
- బొంగ్లూర్‌లో కొనసాగిన ప్రగతినివేదన పాదయాత్ర



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



గజమాలతో సత్కరిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇస్తామని అంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు కోర్టు కేసులు వేసి అడ్డుకుంటున్నారని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రగతినివేదన పాదయాత్ర ఆదివారం బొంగ్లూర్‌లో కొనసాగింది. ఉదయం బొంగ్లూర్ గేటు, బొంగ్లూర్ వార్డుల్లో ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. బొంగ్లూర్‌లో ఇళ్ల జాగాలు పంచడానికి ఎమ్మెల్యే కృషి చేస్తుంటే కొంతమంది ప్రతిపక్ష పార్టీల నాయకులు కావాలనే కోర్టు కేసులు వేసి అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు కొప్పు జంగయ్య, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జంగయ్య, రాజు, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి రామారావు, రాజేష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, దర్శన్‌గౌడ్, నర్సింహ యాదవ్, సాయిరాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉప్పల ట్రస్టు

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి, చంద్రాయణపల్లి తండాల్లో ఆదివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా మేరమ్మ యాడి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో నిరుపేద ఇళ్ల నిర్మాణానికి ట్రస్టుద్వారా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ సుజాత, తలకొండపల్లి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోపాల్‌నాయక్, నాయకులు జ్యోతయ్య, లక్ష్మణ్‌నాయక్, దేవ్లానాయక్, కిశోర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రాము, రాజు, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపిద్దాం: యూటీఎఫ్

మంచాల: మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యతా ఓటు టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డికి వేసి గెలిపించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల కొరకు, పాఠశాలల అభివృద్ధికి మాణిక్‌రెడ్డి చేసిన నిరంతరం పోరాడుతున్నారన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడుతుల్జారాం,ఉపాధ్యక్షుడు యాదయ్య, జిల్లాకౌన్సిలర్లుబషీర్,నాగేష్, కోశాధికారి రవీందర్‌రాజు, ఉపాధ్యక్షురాలు శ్యామల, విశారధ, మీడియా కన్వీనర్ మహేందర్, మహిళా కన్వీనర్ రుబీన పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో ప్రచారం..

తుర్కయంజాల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించుకోవాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్, సూరజ్‌నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు కల్పన, కోశాధికారి జగన్నాద్ శర్మ, జిల్లా కార్యదర్శులు బుగ్గరాములు, గణేష్, అడిట్ కమిటీ సభ్యులు రాములు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీతోనే సంక్షేమ పాలన

నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న అర్జున్‌రెడ్డి

మాడ్గుల: తెలంగాణలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మళ్లీ అమలు కావాలంటే కేవలం వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలమ్మతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ కల్వకుర్తి తాలూకా ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇర్విన్ గ్రామంలో ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. అర్జున్‌రెడ్డి ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన సుమారు 30 మంది వైఎస్సార్‌టీపీలో చేరగా వారందరికి చీమర్ల అర్జున్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు శివనాయక్, నాయకులు.. ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, అంతయ్య, రామస్వామి పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్

కడ్తాల్: అభివృద్ధి సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొందని.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, బడుగు బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి.. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై చేస్తున్న విమర్శలు, అసత్య ప్రచారాలు విడ్డూరంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అత్యంత ప్రజాచైతన్యం కలిగిన కల్వకుర్తి నియోజకవర్గంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి, ప్రజల తిరస్కరణకు గురైన మీరు.. మూడుసార్లు ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన జైపాల్‌యాదవ్ పైన అసత్య ఆరోపణలు, లేనిపోని విమర్శలు చేయడం తగునా అని విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కట్టలేదని అసత్య ప్రచారం తగదని కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో 250 డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఆచారితో పాటు, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నర్సింహ, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, భిక్షపతి, రాంచందర్, చంద్రమౌళి, మహేశ్, రమేశ్, రామకృష్ణ, సురేశ్, మల్లేశ్, పాండు, ప్రశాంత్ ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో సర్పంచ్, గ్రామస్తులు

కడ్తాల్: కడ్తాల్ మండలం గడ్డమీదితండా పంచాయతీ పరిధిలోని వెలుగురాళ్లతండాలో తుల్జా భవాని మాత ఆలయంతోపాటు, కిరదాదా ఆలయాల నిర్మాణ పనులకు గిరిజన నాయకుడు, గడ్డమీదితండా గ్రామ సర్పంచ్ పాండునాయక్ ఆదివారం గ్రామప్రజలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పాండునాయక్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణాలతో భక్తిభావం పెంపొందుతుందని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజం శాంతి నెలకొంటుందని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులకు ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గురువు సేవ్యాబావోజీ, ఉప సర్పంచ్ రమణ, నాయకులు రమేశ్‌నాయక్, సరియానాయక్, వాల్యానాయక్, లోక్యానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, వెంగల్‌రావు, మోహన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తేయండి

సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కురుమయ్య



పాదయాత్రకు తరలుతున్న పారిశద్ధ్య కార్మికులు

తలకొండపల్లి: జీఓ నంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600 నెలసరి వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్ర ఆదివారం జిల్లాలోని మహేశ్వరం మండలానికి చేరుకుంది. మండల కేంద్రం నుంచి పారిశుధ్య కార్మికులు పాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కురుమయ్య మాట్లాడుతూ... కారోబార్, బిల్ కలెక్టర్‌లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750, వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న పారిశుధ్య కార్మికులను మొదటి ప్రాధాన్యతగా గుర్తించి డబల్‌బెడ్‌రూంలను మంజూర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి స్థలం ఉండి ఇండ్లు లేని వారికి తక్షణమే రూ.5 లక్షలు మంజూర్ చేయాలన్నారు. ఈనెల 28న పాదయాత్ర ముగుస్తుందని.. ముగింపిఉ సందర్భంగా హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు యాదమ్మ, మండల కోకన్వీనర్ రవనీల, సభ్యులు పాండు, యాదమ్మ, మైసయ్య, పోచమ్మ, అంజయ్య, జంగమ్మ, కురుమయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



కడ్తాల్: వేణుగోపాలస్వామి రథోత్సవంలో భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రుక్మిణీ సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి విగ్రహాలను అధిష్టింపజేసి ఆలయ పరిసరాలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ రాములుగౌడ్, ఉప సర్పంచ్ నరేశ్, నాయకులు భీష్మాచారి, బాలకృష్ణగౌడ్, రాజీవ్, ఈశ్వర్ యాదవ్, మహేందర్ గౌడ్, బల్వంత్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల కోసం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం విశాలమైన చలువ పందిర్లు వేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో అంకురార్పణ, విశ్వక్సేన ఆరాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 28న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.